# కరెంట్ ఫుల్.. సాగు జోష్

- స్వరాష్ట్రంలో మారిన వ్యవసాయరంగ పరిస్థితులు
- పచ్చని పంటలతో కళకళలాడుతున్న భూములు
- ఆనందంలో రైతులు



చెల్పూర్‌లో కళకళలాడుతున్న పంట పొలాలు



కందుగులలో పంటకు నీళ్లు పెడుతున్న రైతు రావుల కోమల్‌రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్, అక్టోబర్ 18: నాడు సమైక్య రాష్ట్రంలో అన్నదాతల ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉండేవి. ముఖ్యంగా విద్యుత్ కోతలతో చేతికొచ్చే దశలో పంటలు కండ్ల ముందే ఎండిపోయి నష్టం వాటిల్లేది. అప్పటి ప్రభుత్వం వ్యవసాయానికి ఏడు గంటలు మాత్రమే కరెంట్ ఇవ్వడంతో రైతాంగం నానాఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఉదయం నాలుగు గంటలు, రాత్రి మూడు గంటలు రెండు దఫాల్లో కరెంట్ సరఫరా చేయడం, లోవోల్టేజీ సమస్య కారణాలతో మోటర్లు ఒకే ఫసల్‌లో రెండు మూడు సార్లు కాలిపోయేవి. దీంతో పంటలు ఎండి పోవడమే కాకుండా రైతులపై ఆర్థికంగా భారం పడేది. ఇక రాత్రిపూట పొలాల దగ్గరికి వెళ్లిన రైతులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి 24గంటల నాణ్యమైన కరెంట్ సరఫరా చేస్తుండడంతో వ్యవసాయం పండుగలా మారిందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో తమ భూములు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయని మురిసిపోతున్నారు.

### కరంట్ రంది పోయింది



తెలంగాణ రాకముందు కరంట్ కోతలు ఎక్కువగా ఉండేవి. లోవోల్టేజీతో ఒకపసలుకు మోటరు రెండు మూడుసార్లు కాలిపోయేది. తెలంగాణ వచ్చిన తర్వాత కరంట్ రంది పోయింది. ఇప్పటిదాకా మోటరు కాలిపోలేదు. నీళ్లకు ఢోకా లేకపోవడంతో పంటలు మంచిగ పండుతున్నయ్.

*-పూరెడి బక్కారెడ్డి(ఇప్పల్‌నర్సింగాపూర్)*

### కరంట్ లేక పంటలు ఎండిపోయేవి



ప్రత్యేక రాష్ట్రం ఏర్పడకముందు కరంట్ సరిగా రాక పంటలు ఎండిపోయేవి. ఎండకాలం వచ్చిందంటే జనరేటర్లు పెట్టి పంటలకు నీళ్లు అందించేవాళ్లం. దీంతో పెట్టుబడి పెరిగిపోయేది. ఇప్పుడు కరంట్ ఫుల్‌గా ఉంటున్నది. పంట ఎండిపోయే ముచ్చటలేదు. రైతులకు కరంట్ సమస్య తీర్చిన కేసీఆర్‌కు రుణపడి ఉంటా.

*-కాసం రఘుపతి రెడ్డి(కందుగుల)*



హుజూరాబాద్: పట్టణంలోని సిటీ సెంటర్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

## బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 18: హుజూరాబాద్‌లోని సిటీ సెంట్రల్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాట చెప్తే కచ్చితంగా నెరవేరుస్తానని, హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కడతానని తెలిపారు. అలాగే కౌశిక్‌రెడ్డి కుమార్తె శ్రీనికారెడ్డి మాట్లాడుతూ, తాను లండన్, న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్ లాంటి నగరాలు తిరిగి చూశానని, వాటి తరహాలోనే సీఎం కేసీఆర్ నాయకత్వంలో అతి తక్కువ కాలంలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, అరకొర విద్యుత్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విదేశాల్లో సైతం లేని విధంగా తెలంగాణలో 24గంటల కరెంట్, 24గంటల పాటు తాగు, సాగునీరు అందిస్తున్న ఘనత ఒక్క సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి ఒక్కసారి అవకాశం ఇస్తే కేసీఆర్ సీఎంగా, తన తండ్రి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా తెలంగాణ, హుజూరాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని పేర్కొనడంతో కార్యకర్తలు, నాయకులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. అంతకు ముందు సిర్సపల్లి క్రాస్‌రోడ్‌లో శ్రీబీరన్న దేవాలయాన్ని కౌశిక్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాత్రి మున్సిపల్ పరిధిలోని 13, 15, 16, 18వ వార్డుల్లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్, ఎంపీపీ ఇరుమల రాణీసురేందర్ రెడ్డి, జడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, సంగెం ఐలయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు బద్దుల రాజ్‌కుమార్‌యాదవ్, 4వ వార్డు కౌన్సిలర్ మక్కపెల్లి కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ సోషల్‌మీడియా నాయకురాలు గొడిశాల పావని గౌడ్, హుజూరాబాద్ పట్టణ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముఖ్యకార్యకర్తలతో సమావేశం

హుజూరాబాద్ రూరల్,అక్టోబర్18: మండలంలోని కందుగుల, చిన్నపాపయ్యపల్లి, పెద్దపాపయ్యపల్లి, కాట్రపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, సర్పంచులు ప్రభావతి, దేవేంద్ర, రజిత, నిరోషా, సింగిల్ విండో చైర్మన్ కొండల్‌రెడ్డి, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, మండ సతీశ్, బెల్లి రాజయ్య, కిషన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కిరణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## శిశుమందిరాలు సంస్కృతీ సంప్రదాయాలకు నిలయాలు

- మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు



జమ్మికుంట: శిశుమందిర్‌లో సరస్వతీ మాతకు పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట, అక్టోబర్ 18: శిశుమందిరాలు సంస్కృతీ సంప్రదాయాలకు నిలయాలని, వాటిని కాపాడుకుందామని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో పాఠశాల స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో భాగంగా పూర్వ విద్యార్థులు, తదితరుల ఆధ్వర్యంలో నూతన భవన సముదాయాన్ని నిర్మించగా, సదరు భవనాన్ని చైర్మన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిశుమందిరంలో విలువలతో కూడిన విద్య అందుతున్నదని, ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులెందరో ఆయా రంగాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల్లో గొప్పగా రాణిస్తున్నారని కొనియాడారు. అంతకుముందు చైర్మన్, తదితరులు సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో శిశుమందిర్ ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, పేరెంట్స్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టుల వద్ద నగదు పట్టివేత

హుజూరాబాద్ టౌన్/ ఇల్లందకుంట, అక్టోబర్ 18: హుజూరాబాద్ మండలంలోని పరకాల ఎక్స్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1,75,700 పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ బుధవారం తెలిపారు. అలాగే ఇల్లందకుంట మండలం సిరిసేడు చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన తనిఖీల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్షాయాభై ఐదు వేలను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ వెల్లడించారు. అలాగే మండలానికి చెందిన వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 14 మందిని తహసీల్దార్ రాణి ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

## అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



జమ్మికుంటలో ఆర్పీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

జమ్మికుంట, అక్టోబర్ 18: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, అర్హులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఆర్పీలు, ఓబీలకు ఎలక్షన్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని, అందుకు ఓటింగ్ పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అందరూ ఎన్నికల నియమావళి నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. అనధికార కార్యక్రమాల్లో పాల్గొనకూడదని చెప్పారు. విధుల్లో నిష్పక్షపాతంగా ఉండాలని తెలిపారు. తర్వాత ఆర్పీలు, ఓబీలతో ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఎండీఎంసీ మల్లీశ్వరి, ఆర్పీలు, ఓబీలు పాల్గొన్నారు

## ఓటర్లను చైతన్యపర్చాలి

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 18: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా మెప్మా సభ్యులు ఓటర్లను చైతన్య పరచాలని ఎన్నికల మోడల్ కోడ్ ఇన్‌చార్జి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సూచించారు. బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో హుజూరాబాద్ పట్టణ సమాఖ్య సభ్యులకు ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులు, మెప్మా నాయకులు ఈనెల 30 లోగా ఓటు హక్కు లేని వారు రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నవంబర్ 30న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య పరచాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని, ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజారామ్మోహన్‌రాయ్, మెప్మా ఏడీఎంసీ కే మానస, సీఎల్ఆర్పీలు రమాదేవి, స్వరూప, ఆర్పీలు, ఓబీలు, బీఎల్‌వోలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎన్నికల మోడల్ కోడ్ ఇన్‌చార్జి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

## కోర్టులో బతుకమ్మ సంబురాలు



కోర్టులో బతుకమ్మలతో జడ్జీలు, మహిళా న్యాయవాదులు, సిబ్బంది

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 18: హుజూరాబాద్ కోర్టు ఆవరణలో జడ్జీలు, మహిళా న్యాయవాదులు, సిబ్బంది బతుకమ్మ ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మహిళా న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది పాల్గొని ఆడిపాడారు. కోలాటాలు ఆడారు. చక్కగా అలంకరించిన బతుకమ్మలకు సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సంబురాల్లో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కంకణాల భగవాన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది, కోర్ట్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

జమ్మికుంట, అక్టోబర్ 18: పట్టణంలో దుర్గామాత శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం పలు మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మారుతీనగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పొనగంటి మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సంపత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మల్లయ్య